# మృతుల పునరుత్థానము

## The Resurrection of the Dead

**పాఠ్యోద్దేశం** : మానవాళి, మృతుల పునరుత్థానానికి సంబంధించిన బైబిలు దృక్పథం మరియు క్రైస్తవుని ఆత్మీయ శరీరం అనువాటిని అర్థం చేసుకొనుట.

## ఉపోద్ఘాతము

"నేను" మృత్యువాత పడకుండ బ్రతికి ఉండటం ఎలా సాధ్యం అవుతుంది?" మానవులందరు అడుగుతున్న ప్రాథమిక ప్రశ్నలలో యిది ఒక ప్రశ్న. అయినప్పటికి, ఒక్కొక్కరికి ఒక్కరు చొప్పున మనుష్యులు చనిపోతున్నారని మనం ఆలోచిస్తే మన యొక్క మనుగడ పథకం భౌతికమరణాన్ని అధిగమించునదై వుండాలని మనకు అర్థ మౌతుంది. మరణం తరువాత కూడా బ్రతికే ఉండటానికి ప్రపంచ మతాలలో అధిక భాగం ఏదో ఒక పథకాన్ని అనుగ్రహిస్తూనే వున్నాయి. హిందూ, బౌద్ధ మతాలు పునఃర్జన్మను బోధిస్తున్నాయి. పునఃర్జన్మ అనగా వారి నమ్మకము ప్రకారము ఒక వ్యక్తి ఈ లోకంలో మరణించిన తరువాత మనిషిగానో, జంతువుగానో, పురుగు మొదలగు వానిగా మరలా మరలా దేహాంతరము చెందుట. చివరికి వారు చెప్పు విషయమేమనగా నిర్వాణము. నిర్వాణమనగా వారి ఉనికిని మొత్తము "చీది వేయుట"యని అర్థము. కన్ఫ్యూసియన్లును, టోయికులు అను వారును మరణము తరువాత తమ ఆత్మ పూర్వీకుల ఆత్మలతో కలిసిపోవును అని నమ్ముదురు. ముస్లిములును, కొందరు యూదులను మరణించిన తరువాత ఆత్మలు పరలోకమునకు వెళ్లునని నమ్ముదురు. అయినను తమ ప్రయాణము కొరకు ఎవరి మీద ఆధారపడవలెనో ఆ యేసుక్రీస్తును వారు అంగీకరించరు. "పునరుత్థానమును జీవమును నేనే, నాయందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రదుకును బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని యేసు మార్త తమ్ముడైన లాజరు మరణించినప్పుడు ఆమెతో పలికెను. ఆ తరువాత ఆయన " ఈ మాట నమ్ముచున్నావా?" అని ఆమెను అడిగెను. (యోహాను 11:25,26) నమ్ము చున్నామని క్రైస్తవులందురు.

క్రైస్తవులు మరణించిన తరువాత క్రీస్తునందు వారు నిద్రింతురని ఒకటవ పాఠంలో మనము నేర్చుకొనియుంటిమి. చిన్న పిల్లలు క్రైస్తవులకు మాదిరిగా వున్నారని యేసు ప్రకటించినందున, మరణించిన తరువాత చిన్న పిల్లలు కూడా శాంతికరమైన నిద్రను కలిగియుందురని మనము తప్పక ఊహించవలసియున్నది (మత్తయి 18:3). రక్షణపొందని మనుష్యులు మరణించిన వెంటనే పాతాళ లోకమందలి అగ్నిజ్వాలలో యాతనపడుటకు నేరుగా పోవుదురని ధనవంతుడు లాజరు అను యేసు చెప్పినకథ నుండి మనము నేర్చుకొనియుంటిమి. యేసు తిరిగి వచ్చునప్పుడు మరణించిన వారందరి యొక్క పునరుత్థానమును గూర్చి ఈ పాఠంలో మనము చదువుకొందుము. అలాగే, యేసు వచ్చినప్పుడు సజీవులైయుండిన వారికి కూడా ఏమి సంభవించునో మనము చూచెదము.

## పాఠము

*కాబట్టి నిర్జీవ క్రియలను విడిచి, మారుమనస్సు పొందుటయు, దేవుని యందలి విశ్వాసమును బాప్తిస్మములను గూర్చిన బోధయు, హస్తనిక్షేపణమును, మృతుల పునరుత్థానమును, నిత్యమైన తీర్పును అను పునాది మరల వేయక, క్రీస్తును గూర్చిన మూలోపదేశము మాని, సంపూర్ణులమగుటకు సాగిపోదము.* హెబ్రీ 6:1,2

హెబ్రీ పత్రిక వ్రాసినవాని ప్రకారము, మృతుల పునరుత్థానము అను బోధ క్రైస్త వ్యములోని మూలోపదేశమే. అది యొక సామాజిక న్యాయ సూత్రములాంటిదికాదు. బాప్తిస్మము, హస్త నిక్షేపణము, నిత్యమైన తీర్పు అనువాటి వలే అది దేవుని కుమా రులుగా మన యొక్క పరిశు ద్ధతకు ముఖ్యమైన ఉపదేశమైయున్నది. క్రైస్తవుని ఆత్మీయ పెరుగుదల లేక పరిశుద్ధ పరచబడుట అనునది దేవుని రాజ్యము లోనికి సాంఘీకీ కరణము చెందుట వంటిదైయున్నది క్రైస్తవ్యము అంతా దీనిగూర్చియే. మృతుల పునరుత్థానమనునది దేవుని రాజ్యములోనికి క్రైస్తవులుగా మనము పరిశుద్ధ పరచబడు విధానములో కేవలము పనిచేయు సాధనము మాత్రమే, కాని ఇది లేకుండ మిగిలిన క్రైస్తవ విశ్వాసమంతయు వ్యర్థమని అపొస్తలుడైన పౌలు ప్రకటించెను. దయచేసి (1 కొరింథీ. 15:12-19) చదువుము.

"ఆదామునందు అందరు మృతి పొందుచున్నందున" ప్రతి యుగములోను దేవుడు మరణము నుండి బయటపడు మార్గమునను గ్రహించి యుండెను. కావున మృతుల పునరుత్థానమును గూర్చి బోధ క్రైస్తవ్యముతోనే ఆరంభము కాలేదు. "పొదను గురించిన భాగములో ప్రభువు అబ్రాహాము దేవుడనియు, ఇస్సాకు దేవుడనియు యాకోబు దేవుడనియు చెప్పుచు, మృతులు లేతురని మోషే సూచించెను ఆయన సజీవులకే దేవుడు కాని మృతులకు దేవుడు కాడు. ఆయన దృష్టికి అందరును జీవించు చున్నారు."(లూకా 20:37,38). యుగాంతశాస్త్రమును గూర్చి పాత నిబంధన ప్రవక్తల యొక్క యితర బోధలు క్రింద యివ్వబడ్డాయి.

*మృతులైన నీ వారు బ్రదుకుదురు నావారి శవములు సజీవములగును మంటిలో పడియున్నవారలారా, మేల్కొని ఉత్సహించుడి. నీ మంచు ప్రకాశమానమైన మంచు భూమి తనలోని ప్రేతలను సజీవులనుగా చేయును.* యెషయా 26:19

*నిలువరమైన పట్టణము మనకిక్కడ లేదు గాని,ఉండబోవుచున్నదాని కోసరము ఎదురుచూచు చున్నాము.* హెబ్రీ. 13:14

ఒక్కడైయున్న తన కుమారుని బలిగా సమర్పించమని అతనికి దేవుడు ఆజ్ఞాపిం చినప్పుడు ఆ ఆజ్ఞకు విధేయుడు కాగల బలమైన శీలమును అబ్రాహాము కలిగి యుండెను. ఏలయనగ, "ఆ అబ్రాహాము, మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై, తన యేక కుమారుని అర్పించి, ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రీ. 11:17-19). దానియేలు వలె మృతుల పునరుత్థానమును గూర్చిన యేసు యొక్క బోధ మృతు లందరికి సంబంధిం చినదైయున్నది. వారి వారి తీర్పుకు అనుగుణమైన రీతిలో మంచి వారైనను, చెడ్డ వారైనను మృతులలో నుండి లేతురు. "మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుట కును నిత్యముగ హేయులగుటకును మేలుకొందుర"ని దానియేలు చెప్పెను (దాని యేలు 12:2). ఈ క్రింది ప్రకటనలో దానియేలుతో యేసు ఏకీభవించుచున్నాడు.

> *దీనికి ఆశ్చర్యపడకుడి ఒక కాలము వచ్చుచున్నది ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు.* యోహాను 5:28, 29

యేసు తానే మరణించి తిరిగి లేచి, లోకమునకు కనబడుదునని తన శిష్యులతో చెప్పినప్పుడు మృతుల పునరుత్థానమును గూర్చిన తన బోధను శక్తివంతముగా ఒప్పింప జేయకలుగునట్లు చేసెను. ఆయన మృతుడై లేచి నలభై దినముల తరువాత పర లోకమునకు ఆరోహణమైనప్పుడు ఇది మరింత బుజువైయ్యింది (అపొ. కార్య. 1:9-11).

> *అప్పటినుండి తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దలచేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రుల చేతను అనేక హింసలు పొంది, చంపబడి, మూడువదినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలుపెట్టగా.* మత్తయి 16:21

యేసును చంపిన తరువాత, ఆ హంతకులు మృతుల పునరుత్థానము అను బోధ యొక్క విలువను గుర్తించినారు. మృతులలో నుండి ఆయన తిరిగి లేచెనను వార్తను కూడా ఆపుటకు వారు ప్రయత్నించిరి (మత్తయి 27:62-66). ఈ మంచి వార్తను గూర్చిన సమాచారమును తుద ముట్టించుటలో వారు విఫలులైరి. ఏలయనగా అపొస్తలులకును, యితరులైన ఐదు వందల మందికిని ఆయన అగుపించెను. యేసు పరమునకు తిరిగి వెళ్లిన తరువాత కూడ అపొస్తలుడైన పౌలుకు అగుపించినాడు (1 కొరింథీ. 15: 5-8). తత్ఫలితముగ, మొదటి శతాబ్దములో దేవుని రాజ్య సువార్తలో ప్రముఖ భాగముగ మృతుల పునరుత్థానము అనుబోధ ప్రకటింపబడినది.

తల్లి గర్భము నుండి పుట్టినది మొదలుకొని కుంటివాడైన ఒక మనుష్యుని పేతురు, యోహాను స్వస్థపరచిన తరువాత శృంగారమను దేవాలయపు ద్వారము నొద్ద పరిసయ్యులు సద్దూకయ్యులు అను రెండు తెగలకును యేసుక్రీస్తు ద్వారా మృతుల పునరుత్థానము కలుగునని వారు ప్రకటించిరి (అపొ.కార్య. 3:1,2; 4:1,2). సద్దూక య్యులు ఏ విధమైన పునరుత్థానమును నమ్మరు మరియు ఈ రెండు తెగలలో ఎవరును యేసుక్రీస్తు మెస్సీయా అని నమ్మరు (మత్తయి 22:23, 41-46). మృతుల పునరుత్థానమును గూర్చిన తన నిరీక్షణను బట్టి పౌలు తీర్పులో నిలిచియుండినప్పుడు ఈ బోధను గూర్చి పరిసయ్యులకును, సద్దూకయ్యులకును వున్న భేదమును బహుశ, తన ప్రాణమును కాపాడుకొనుటకు వినియోగించుకొని యుండవచ్చును దయచేసి (అపొ. కార్య. 23:6-10) చదువుము. ఇశ్రాయేలీయులకు అధిపతియైన ఫేలిక్సు యెదుట పౌలు ఈ క్రింది ఒప్పుకోలు గావించెను.

> *ధర్మశాస్త్రమందును ప్రవక్తల గ్రంథములయందును వ్రాయబడియున్న వన్నియు నమ్మి, నీతిమంతులకును అనీతిమంతులకును పునరుత్థానము కలుగబోవుచున్నదని వీరు నిరీక్షించుచున్నట్టు నేను కూడ దేవునియందు నిరీక్షణయుంచి, వారు మతభేదమని పేరుపెట్టు ఈ మార్గము చొప్పున నా పితరుల దేవునిని సేవించుచున్నానని తమరి యెదుట ఒప్పుకొనుచున్నాను.అపొ.కార్య. 24:14,15*

"దేవుడు మృతులను లేపునను సంగతి నమ్మతగనిదని మీరేల యెంచు చున్నారు?" అని అపొస్తలుడైన పౌలు అగ్రిప్ప రాజును అడిగినప్పుడు, అతడు "ఎక్కడ నుండి వచ్చుచున్నాడో? అర్థము చేసికొనగలుగుటకు దేవుడు సృష్టించిన దానినంతటిని, మానవుని కొరకు ఆయన చేసినదానినంతటిని చూడవలసియున్నది (అపొ.కార్య. 26:8). అరేయొపగు మధ్య పౌలు యేసును గూర్చియు, పునరుత్థానమును గూర్చియు జ్ఞాను లైన ఎపికూరీయులకును స్తోయికులకును ప్రకటించగా వారు అపహాస్యముచేసిరి (అపొ. కార్య. 17:16-32). ఒకడు ఈ విషయములను యింకను హేళనాస్పదముగ ఎంచిన యెడల ఒకనాడతడు ధనవంతుని ప్రక్కన పాతాళాగ్ని జ్వాలలలోయాతన పడినప్పుడు తప్పక ఆశ్చర్యపడును. మన కాలపు తాత్వీకులలో చాలామంది ఇంకను హేళనచేయుట మానుకోలేదు. అయినను, యేసుబోధను వారి హేళన మార్పుచేయ జాలదు.

మృతుల పునరుత్థానమున్నదని మనము నిశ్చయముగా ఒప్పుకొనిన తరువాత అది ఎప్పుడు? ఎట్లు జరుగును? అనునది మనము తెలుసుకొన గోరునది. మరియ, లాజరుల సోదరి మార్త "ఆయనతో -అంత్యదినమున పునరుత్థానమందు లేచునని ఎరుగుదున"ని చెప్పినప్పుడు ఆ రోజు ఏదో సరిగా ఆమె పలికినది (యోహాను 11:24). మృతులు పునరుత్థానము చెందుదురని ఎదురు చూడవలసిన దినము అంత్య దినమని యేసు కూడ ఈ క్రింది లేఖనములో చెప్పెను.

> *కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము అంత్యదినమున నేను వానిని లేపుదును.* యోహాను 6:40

అంత్యదినమున మృతులను యేసు తానే లేపును. యేసుతో కూడా దేవుడు లేపును అని పౌలు చెప్పినను పౌలు ద్వారా పరిశుద్ధాత్మ బోధించిన దానికిని యేసు యొక్క బోధకును మధ్య పరస్పర విరుద్ధమేదియు లేదు (2 కొరింథీ. 1:9; 4:14) దేవత్వము (తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు) మృతుల పునరుత్థానములో పని చేయుచున్నారని కేవలము అగుపించుచున్నది. మన తదుపరి పాఠంలో మనము పరిశోధన చేయబోవు అంత్య తీర్పు అనునది కూడా అంత్య దినమున సంభవించును, అంత్యదినము ఎప్పుడును యేసుక్రీస్తు రెండవ రాకడతో కలిసి ప్రస్తావించబడినది (యోహాను 12:48; హెబ్రీ. 9:27,28). అంత్య దినపు ఆరంభ విషయములనుగూర్చిన చక్కని వివరణను బాల్య దశలోనున్న థెస్సలొనికయలోని సంఘము ఈక్రింది లేఖనములో పొందినది.

> *ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి యుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపో బడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము.*
>
> *1 థెస్స. 4:16,17*

దేవుడే తప్ప, మరెవరును ఆ రోజు ఎప్పుడు వచ్చునో ఎరుగరు దేవుడొక్కడే ఎరుగునని యేసు చెప్పిన విషయమును తాము ఎరుగుదుమని అబద్ధప్రవక్తలు చెప్పియున్నారు (మత్తయి 24:36). ప్రభువుదినము వచ్చియుండెనని కొందరు చెప్పుదురు. మరికొందరు అపహాసకులు అది యెన్నడును సంభవింపదని చెప్పుదురు (2 థెస్స. 2:2; 2 పేతురు 3:4). అది ఎప్పుడు అనునది మనము యెరుగవలసిన అవసరము అసలు లేనేలేదని పౌలు చెప్పెను (1 థెస్స. 5:1,2) రాత్రివేళ దొంగ వచ్చి నట్లు అది వచ్చునని మనమెరుగుదుము. అనగా లోకము యధావిధిగా తన వ్యాపా రము కొనసాగించుకొనుచుండును (1 థెస్స. 5:2) అలాగే, అంత్యదినమునకు పూర్వము ఒకవిధమైన, బలమైన, భ్రష్టత్వము సంభవించును (2 థెస్స. 2:3). అయిననూ, అంత్యదినము వచ్చినప్పుడు అది వచ్చియున్నదని ఆశ్చర్యపడవలసిన అవసరము మనకు లేదు. మనకు తెలుస్తుంది. అందరును చూడకలుగునట్లుగానుండుట యేసు రాకడకు మొదటి సంకేతము (ప్రకటన. 1:7). ఆకాశములో యేసును మనము చూచినప్పుడు అంత్యదినము అదేనని మనమెరుగుదుము (మత్తయి 24:29-31). అప్పుడు మృతుల పునరుత్థానము సంభవించును దేవుడు మాత్రమే దానినెరుగును.

"ఇది ఎట్లు సంభవించును?" అనునది మన రెండవప్రశ్న. అనగా ఎట్టి శరీరమును మనము పొందుదుము. అప్పుడు సంభవించు సంఘటనల వరుస క్రమమేది? అపొస్తలుడైన పౌలు ఈ ప్రశ్న వచ్చునని ముందుగానే తలంచి దానికి జవాబు చెప్పినాడు. అయితే, అది క్రైస్తవుల కొరకు మాత్రమే. దయచేసి (1 కొరింథీ. 15:35-58) చదువుము. మృతులలో నుండి లేపబడి ఆత్మ సంబంధమైన శరీరము ధరించుకొనవలెనని మనము ఎదురు చూచిన యెడల సహజముగా మనము చనిపోవలసి యున్నది, యేసు తిరిగి వచ్చుటకు ముందు అందరును మరణించరు ఒక్క క్షణములో వారు మార్పు పొందుదురు. మనము మరణించునప్పుడు మన బ్రతుకులలో పరిశుద్ధాత్ముడుండని యెడల అక్షయ మైన, మహిమగల,శక్తివంతమైన ఆత్మ సంబంధమైన శరీరమును ధరించుకొందుమని ఎదురు చూడలేము (రోమా. 8:11).

దేవుని రాజ్యములో మన నివాసము నిమిత్తమై విశ్వాసులము, దేవుని కుమా రులమైన మనము పొందు ఆ గొప్పశరీరమునుగూర్చి గ్రహించుట కష్టమే. "*సమస్తమును తనకు లోపరచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును*" ఫిలిప్పీ. 3:20,21. అని ఫిలిప్పీయులకు చెప్పబడెను. క్రీస్తు యొక్క "మహిమ గల శరీరము" ఎట్లుండునో మన మెరు గము. గాన, ఈక్రింది లేఖనములో అపొస్తలుడైన యోహాను చెప్పిన వాగ్దానముతో మనము సంతృప్తి పడవలసియున్నది.

> *ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లు గానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము. 1 యోహాను 3:2*

యేసు యొక్క శీలము, వ్యక్తిత్వమునకు సంబంధించి ఆయన ఎలాంటివాడో మన మెరుగుదుము గనుక ఆయన మహిమగల శరీరమును గూర్చి యోహాను యిక్కడ మాట్లాడు చున్నాడు. యేసు అంగీకరించినటువంటి పునరుత్థాన శరీరమును గూర్చిన వాగ్దానమును నిశ్చయముగ మనము అంగీకరించుదుము. మహిమ శరీరములో మనకు కడుపుండదని ఎరుగుటకు కడుపు జబ్బులున్నవారు సంతోషించుదురు (1 కొరింథీ. 6:13). మనము దేవదూతలమైపోము. కాని మన పునరుత్థాన శరీరములు భౌతికమైనవి కానందున దేవదూతలవలె వుందుము. మగ, ఆడ అను భావము ఉండదు. గాన, పరలోకములో నిజముగా సమానత్వమును మనమంతా కలిగియుండగలము. "*ఈ లోకపు జనులు పెండ్లి చేసికొందురు, పెండ్లికియ్య బడుదురు, గాని పరమును మృతుల పునరుత్థానమును పొందుటకు యోగ్యులని యెంచబడినవారు పెండ్లి చేసికొనరు. పెండ్లికియ్యబడరు, వారు పునరుత్థానములో పాలివారైయుండి, దేవదూత సమానులును దేవుని కుమారులునైయుందురు గనుక వారికను చావనేరరు*" అని యేసు చెప్పెను (లూకా 20: 34-36).

ఆకాశ మండలములో యేసును ఎదుర్కొనుటకు క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులైన క్రైస్తవులు మార్పుచెంది యేసును కలుసు కొందురు. దీనినే ఆయన ఈక్రింది విధముగా వర్ణించెను.

*ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసికొనిపోబడును ఒకడు విడిచిపెట్టబడును. ఇద్దరు స్త్రీలు తిరుగలి విసరుచుందురు. ఒకతె తీసికొని పోబడును, ఒకతె విడిచిపెట్టబడును. కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి.*

*మత్తయి 24:40-42*

అంత్య దినము యేసు తన పరిశుద్ధులలో మహిమ పరచబడుటకు ఆయన వచ్చు దినము, విశ్వసించినవారియందు ప్రశంసించబడును. అయితే అదే సమయ మందు దేవుని ఎరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయును (1 థెస్స. 1:6-12). దేవుని ఆత్మ కలిగియుండని వారి పున రుత్థానమును గూర్చిన వర్ణన మనకు లేదు. తీర్పు కొరకు వారు తిరిగి లేతురని మాత్రము మనమెరుగుదుము. ఏదో ఒక సమయమునందు తీర్పు జరుగును. భూమియు అందలి కృత్యములు కాలిపోవును. మన తదుపరి పాఠములలో మనము చదువుకొనబోవు సంగతులు ఇవే.

క్రైస్తవమతము యితర మతముల వలె మృతుల పునరుత్థానమును ప్రకటించును. అయితే, భేదమేమి? క్రైస్తవుని పునరుత్థానము కేవలము మానవుని కొరకైన దేవుని సంకల్పములో ఒక ప్రముఖ కార్యము అని ముందుగా గమనింప వలసియున్నది. సంపూర్ణ కార్యక్రమము ఏదనగా, దేవుని రాజ్యము యొక్క నాణ్యమైన జీవము కలిగి నిత్య కుమారత్వమును అనుభవించుటయే. మన పునరుత్థానము, మహిమ శరీ రములు మన కొరకై దేవుని గొప్ప సంపూర్ణ సంకల్పములో అవసరమైన విషయములు. అసలు విషయమేమనగా ఒక మతము యొక్క సంపూర్ణ సంకల్పమును మనము చూడవలసియున్నది. దేవుడు మన వర్తమాన భవిష్యత్ అవసరతలను తన మనస్సు నందుంచుకొనే ఈ సంకల్పమును రూపొందించినాడు. ఆయన మనలను సృష్టించిన విధానమునకు అది అనుగుణమైనది.

పునరుత్థానమును గూర్చి క్రైస్తవుని నిరీక్షణకును, యితర మతములకును మధ్య గల యింకొక గొప్ప భేదము యేసుక్రీస్తే. ఆయన దేవుని కుమారుడు. మరణముపై ఆయన అధికారము గలవాడని ఆయన ఎప్పుడో నిరూపించుకొని యున్నాడు. కావున, మనము ఆయన వాగ్దానమును నమ్మగలము.

*తండ్రి నాకు అనుగ్రహించువారందరను నాయొద్దకు వత్తురు నాయొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను. నా యిష్టమును నెరవేర్చుకొనటకు నేను రాలేదు నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగి వచ్చితిని. ఆయన నాకు అనుగ్రహించిన దాని యంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున దాని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమైయున్నది. కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతి వాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము అంత్యదినమును నేను వానిని లేపుదును. యోహాను 6:37-40*

మార్తను అడిగిన అదే ప్రశ్నను యేసు మనలో ప్రతి ఒక్కరిని అడుగుచున్నాడు. "నీవు దీనిని నమ్ముచున్నావా?"

## చర్చ కోసం ప్రశ్నలు

1. చాలా మతములు దేనిని ఇవ్వజూపుచున్నవి?
2. పునరుత్థానము అను బోధ మూలోపదేశముగా వర్గీకరించినప్పుడు హెబ్రీ గ్రంథకర్త ఏమని భావించెనో వివరింపుము?
3. పునరుత్థానము బోధ మొదట ఎప్పుడు ప్రకటింపబడినది?
4. మన తీర్పుకు పునరుత్థానము ఎట్లు అనుగుణమైనది?
5. పునరుత్థానము అను బోధను యేసు ఎట్లు ఒప్పించెను?
6. క్రీస్తు పునరుత్థానమును గూర్చిన వాస్తవము ప్రచురముగాకుండుటకు క్రీస్తు శత్రువులు గావించిన ప్రయత్నములు ఎందుకు విఫలమాయెను?
7. తాను ఎందుకు విమర్శింపబడుచున్నాడని పౌలు చెప్పెను?
8. మృతుల పునరుత్థానమును గూర్చి వినినప్పుడు హేళన చేసిన వారెవరు?
9. మృతుల పునరుత్థానము ఎప్పుడు సంభవించును?
10. విశ్వాసులైన క్రైస్తవులు పునరుత్థానము చెందునప్పుడు జరుగు సంగతులను వివరించుము?
11. యేసు రెండవమారు వచ్చునప్పుడు భూమి మీద సాధారణముగా పరిస్థితు లెట్లుండును?
12. యేసు ఎప్పుడు తిరిగివచ్చునో ఎవరు ఎరుగుదురు?
13. అంత్య దినము వచ్చియున్నదని మనము తెలిసికొనుటకు మొదటి జాడ ఏది?
14. విశ్వాసముగల క్రైస్తవుని మహిమ శరీరమును వర్ణించుము?
15. మనము మన మహిమ శరీరములను పొందునప్పుడు పరిష్కరింపబడు కొన్ని సమస్యలేవి?
16. పునరుత్థాన శరీరమునకు సంబంధించి నశించినవారి పునరుత్థానమును గూర్చి మనకేమి తెలియును?
17. ఇతర మతములవలన ప్రకటింపబడు పునరుత్థానమును గాక క్రైస్తవ మతములో ప్రకటింపబడిన పునరుత్థానమునందు మనమేల నమ్మిక యుంచవలెను?
18. లాజరు మరణించినప్పుడు మార్తను యేసు అడిగిన ప్రశ్నకు నీ జవాబేమి?